మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## శ్రీరంగనాయక స్వామిని దర్శించుకుని పాదయాత్ర ప్రారంభించిన మాజీ మంత్రి డా.జి.చిన్నారెడ్డి



హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్రను ప్రారంభిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

**శ్రీరంగాపురం,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీరంగనాయక స్వామి ఆలయాన్ని శనివారం ఏఐసీసీ కార్యదర్శి, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చిన్నారెడ్డి దర్శించుకుని అక్కడి నుండి హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం పాదయాత్రను ప్రారంభించడం జరిగింది. వనపర్తి నియోజకవర్గంలో శ్రీరంగాపురం మండలం నుండి ఈ పాదయాత్రను ప్రారంభిస్తూ మండల పరిదిలోని నాగరాల 1,2వ సెంటర్, కంబలాపురం తాండా మీదుగా కంబలాపురం వరకు మొదటి రోజు పాదయాత్ర నడుస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ పాదయాత్రలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి సత్యా రెడ్డి, సీనియర్ నాయకలు కిరణ్ కుమార్, బీసీ సెల్ జిల్లా చైర్మెన్ కోట్ల రవి, చల్లా హరిశంకర్, వివిధ మండలాల అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, రాములు యాదవ్, పెంటన్న, చంద్రశేఖర్ యాదవ్, మత్స్యకార్మిక సంఘం జిల్లా చైర్మెన్ యాదయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు దివాకర్‌యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, కంబలాపురం ఎంపీటీసీ ఎల్లస్వామి, పెబ్బేరు టౌన్ ప్రెసిడెంట్ కారపాకుల వెంకటరాములు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, కాంగ్రెస్ నాయకులు జె.ఆశన్న, గంగాధర్ యాదవ్, పురుషోత్తం, శ్రీనవాస్ గౌడ్, శంకర్ నాయుడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్, నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతం:డీఈఓ గోవిందరాజులు



టెక్నికల్ కోర్సు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ గోవిందరాజులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం డ్రాయింగ్, టైలరింగ్, టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్, నవోదయ పాఠశాలలకు సంబంధించి 9వ తరగతిలో ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయని డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 4 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన డ్రాయింగ్ టైలరింగ్ టెక్నికల్ కోర్సు హయ్యర్ మరియు లోయర్ మొదటి రోజు పరీక్షలకు 671 మంది అభ్యర్థులకు గాను 355 మంది అభ్యర్థులు హయ్యర్, మరియు లోయర్ టెక్నికల్ కోర్సు పరీక్షలకు హాజరయ్యారని, 316 మంది అభ్యర్థులు మొదటి రోజు టెక్నికల్ కోర్సు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. అదే విధంగా నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్షకు జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఆయన సూచించారు. 1812 మంది విద్యార్థులకు గాను 1083 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 729 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పరీక్ష కేంద్రాలను డీఈఓ గోవిందరాజులు, పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, ఇతర అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించి టెక్నికల్ కోర్స్, నవోదయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ గోవిందరాజులు తెలిపారు.

## బిజ్వారంలో తాగునీటి సమస్య..

**రెండు రోజులుగా నీటికోసం ఎదురుచూస్తున్న జనం**

**పట్టించుకోని అధికారులు**



పొలాలలోని బోర్ల వద్ద నీళ్లు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

**మల్దకల్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చడానికి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిజ్వారం గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ, బిసి కాలనీలలో రెండు రోజులుగా మంచినీరు సరఫరా కావడం లేదని నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను గ్రామస్తులు కోరగా అందుకు ఏ మాత్రం స్పందించడం లేదని వివరించారు. గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడం, గ్రామంలో ఉన్న మంచినీటి బోరు మరమ్మతులకు నోచుకోకపోవడం వంటి పరిస్థితుల దృష్ట్యా తాగునీటి కోసం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వివరించారు. సమస్యను పరిష్కరించాల్సిన సర్పంచ్ చూసీ చూడనట్లు వెళ్తున్నారని ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామంలో ఉన్న ప్రజలకే కాకుండా మూగజీవాలు సైతం మంచినీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. గ్రామంలో ఉన్న చర్చిలో ఉన్న బోరు దగ్గరికి వెళ్లి నీళ్లు తెచ్చుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నీళ్లు తెచ్చుకున్నామనుకుంటే ఒక్కటి కూడా చేతిపంపు లేకపోవడం, లక్షలతో కూడిన వాటర్ ట్యాంకులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. త్వరగా అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్య తీర్చాలంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

## ఇండోర్ స్టేడియం కొరకు మంత్రికి వినతిపత్రం..



మంత్రి శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణ కేంద్రానికి ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి శనివారం హైదరాబాద్ లోని క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో స్థల పరిశీలన చేసి మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

## సాగునీరు విడుదల చేయకుంటే..

# ఆమరణ నిరాహార దీక్ష చేస్తా..!

**పదిహేను రోజులుగా తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా అందని సాగునీరు..**

**ఎత్తిపోతల ఆయకట్టు ద్వారా 100 కోట్ల విలువ చేసే పంటల సాగు**

**పోరాడి సాధించుకున్న తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం**

**ఎత్తిపోతల పథకం దగ్గర నీటి విడుదల కోసం ధర్నా నిర్వహించిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే**

**అధికారుల హామీతో ధర్నాను విరమించిన మాజీ ఎమ్మెల్యే, రైతులు**



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేయాలని ధర్నా నిర్వహిస్తున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**ఇటిక్యాల,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద అలంపూర్ నియోజకవర్గంలోని చివర ఆయకట్టు రైతులు సుమారు 15 వేల ఎకరాలలో మొక్కజొన్న, మిరప ఇతర పంటలు సాగు చేసుకున్నారని 15 రోజులుగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయని మరో నాలుగు రోజుల్లో రైతుల పంటలకు సాగునీరు విడుదల చేయకుంటే 15 వేల ఎకరాల పంటలు నష్టపోయి 100 కోట్ల విలువచేసే రైతుల పంటలు ఎండిపోతాయని అధికారులు స్పందించి రైతులకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల చేయాలని ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాజోలి మండలంలోని తుమ్మిళ్ల, పడమటి గార్లపాడు తదితర గ్రామాలలో 6వ రోజు హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో పాల్గొనగా ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు సాగునీరు విడుదల కాక 15 రోజులు అవుతుందని పంటలు ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రైతులతో కలిసి ఎత్తిపోతల పథకం దగ్గరకు చేరుకుని పరిశీలించి ఈ ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్కడే ధర్నా కార్యక్రమం రైతులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐసిసి కార్యదర్శి, మాజీ

- మిగతా4లో..


## మన్యంకొండలో పోటెత్తిన భక్తజనసంద్రం..

**- కొనసాగుతున్న భక్తుల దర్శనాలు**

**- స్వామివారికి దాసంగాలు సమర్పించిన భక్తులు**



మన్యంకొండ కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు



మన్యంకొండలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

**దేవరకద్ర,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుండి భక్తులు స్వామి వారి దర్శనానికి అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో మన్యంకొండలో ఎక్కడ చూసిన భక్తులే కనిపించారు. దేవస్థానం భక్తజన సందోహంతో పులకించిపోయింది. వివిధ ప్రాంతాలనుండి వచ్చే భక్తులు 3కిలోమీటర్ల మేర ఉన్న ఘాటురోడ్డు గూండా నడచుకొంటూ, వివిధ వాహనాలలో కొండ పైకి చేరుకొన్నారు. దీంతో ఎప్పుడూ నిర్మానుష్యంగా కనిపించే ఘాటు రోడ్డు భక్తులతో కళకళలాడింది. దేవస్థానం పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి. దీంతో దేవస్థానం ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. దేవస్థానం దిగువకొండ, తేరుమైదానం, కోనేరు ప్రాంతాలలో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మన్యంకొండలో వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి సేవలు ముగిసినప్పటికి విశేషదినాల సందర్భంగా మన్యంకొండకు భక్తులు పోటెత్తుతున్నారు.

**స్వామివారికి దాసంగాలు..**

కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలను సమర్పించి స్వామివారిని దర్శించుకొన్నారు. మరికొంతమంది తలనీలాలు సమర్పించారు. మన్యంకొండ స్వామివారి బ్రహ్మోత్సవాలు గతనెల 31న అంగరంగా వైభవంగా ప్రారంభమైన విషయం విధితమే. స్వామివారి జాతర ఇంకా నెల రోజులపాటు కొనసాగుతుంది. ఈ నెల రోజులు శని, సోమవారాలలో భక్తులు మన్యంకొండ అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెళ్లి సందడి...

**- సందడిగా మారిన నాగర్‌కర్నూల్ పట్టణ ప్రాంతం...**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ఎంజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5వ సారి 220 జంటలకు నిర్వహించేబోయే పెళ్లి వేడుక అంగరంగా వైభవంగా శుక్రవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఎంజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నాలుగు పర్యాయాలు సామూహిక వివాహ మహోత్సవాలు నిర్వహించారు. ప్రస్తుతం 5వ సారి నిర్వహిస్తున్న సామూహిక వివాహ మహోత్సవ వేడుకలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలువనుంది. నూతన వధువరులకు వివాహ మహోత్సవ ప్రదేశంలో లక్ష్మి నర్సింహ్మస్వామి పూజతో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి జములు దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామూహిక వివాహ మహోత్సవం కంటే ముందు లోక కళ్యాణార్థం లక్ష్మినర్సింహ్మస్వామి దంపతుల కళ్యాణోత్సవం సందర్భంగా మరికల్, తిమ్మాజిపేటల నుంచి శనివారం స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా సామూహిక వివాహ ప్రాంతానికి తీసుకొచ్చారు. తలంబ్రాలు కలుపుట, అవిరన్, నల్లకుండల తెచ్చు కార్యక్రమాలను నిర్వహించారు.



లక్ష్మి నర్సింహ్మస్వామి ఉత్సవ మూర్తులు



ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నల్లకుండలు తెచ్చు కార్యక్రమం



తలంబ్రాలు కలుపుతున్న దృశ్యం



తలంబ్రాలు కలుపుతున్న దృశ్యం



భజనలు చేస్తున్న భక్తపరులు



ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



లక్ష్మి నర్సింహ్మస్వామి ఉత్సవ మూర్తుల ముందు కోలాటాలు వేస్తున్న దృశ్యం

## రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం..!

- జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు




లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:**చాలా కాలంగా పరిష్కారం కానీ కేసులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల సమ్మతితో కక్షిదారులు రాజీ అయ్యారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.రాజేష్‌బాబు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట కోర్టుల్లో 6 బెంచీలు ఏర్పాటు చేసి మొత్తం 1869 కేసులు పరిష్కరించి, రూ.61,567 లక్షల ఆదాయాన్ని కక్షిదారులు అందించారు. 1867 క్రిమినల్ కేసుల పరిష్కారంతో పాటు రూ.33,73,970 లక్షలు, 41 బ్యాంక్ పీఎల్‌సీ కేసులు పరిష్కరించి రూ.27,26,597 లక్షలు, 11 సివిల్ కేసులను పరిష్కరించినట్లు జడ్జీ రమేష్‌బాబు వివరించారు. ఈ సందర్భంగా జడ్జీ రమేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో చాలా కాలంగా పరిష్కారం కాకుండా 7390 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి వల్ల ఇరు వర్గాలకు ఆర్థికంగా, మానసికంగా ఎంతో నష్టం కలుగుతుందన్నారు. న్యాయ సహాయం అవసరమైన పేద వారికి సత్వర న్యాయ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో 1987లో లోక్ అదాలత్ న్యాయ వ్యవస్థను నెలకొల్పిందన్నారు. లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలకు రాజీ మార్గం ద్వారా సమాన న్యాయం అందిస్తుందని, తద్వార సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ జడ్జీ సబిత, జిల్లా ప్రిన్సిపల్ జూనియన్ జడ్జీ స్వరూప, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, బార్ జనరల్ సెక్రటరి పర్వత్‌రెడ్డి, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జాతీయ మహాసభలకు ప్రతినిధిగా అజయ్ ఎన్నిక..



**అమరచింత,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ఈనెల 15-18 వరకు హౌర పట్టణంలోని పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జరుగుతున్న అచల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ 10వ మహాసభలకు ప్రతినిధిగా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర కమిటీకి అజయ్ ధన్యవాదాలు తెలిపారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుండి ఈ మహాసభలకు ప్రతినిధులు హాజరుకానున్నారని వ్యవసాయ కార్మికులు దేశ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ మహాసభలో తీర్మానాలు పెట్టడంతో పాటు రానున్న కాలంలో వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై ఏ విధంగా పోరాటాలు నిర్వహించాలనే దానిపై దిశానిర్దేశం ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు వారు వివరించారు. పిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధికి నిధుల తగ్గింపు వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపు లేకపోవడం వల్ల సన్నా, చిన్న కారు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నాడు. జాతీయ మహాసభలకు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుండి ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ మహాసభలకు డెలిగేటుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీశైలంకు శివస్వాముల పాదయాత్రం ప్రారంభం

**గ్రామాలనుండి 67 మంది శివస్వాములు**



**దేవరకద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** దేవంకద్ర మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 67 మంది శివస్వాములు శనివారం శ్రీశైలంకు పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్బంగా పూజారి మఠం సురేశ్‌స్వామి అధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్బంగా గోపన్‌పల్లి.పుట్టపల్లి,రాజోళి, కొత్తపల్లి గ్రామాలనుంచి శివస్వాములు శ్రీశైలంకు బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్బంగా ఆయా గ్రామలలోని శివాలయాలలో శివస్వాములు పలు పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముఢి ధారణ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ పాదయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయా గ్రామస్థులు అధికసంఖ్యలో పాలొన్నారు.

## వైభవంగా శివస్వాముల మహాపడి పూజ..



**వీపనగండ్ల,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ముంత ఆంజనేయులు, చెన్నమ్మ గృహం లో శనివారం శివస్వాముల మహాపడి పూజను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు వెంకటయ్య, రాముడుల ఆధ్వర్యంలో ముందుగా రుద్రాభిషేకం, మెట్ల పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వ హించారు. మండలంలోని సుమారు 30మంది శివ స్వాములు ఈ మహాపడి పూజకు హాజరయ్యారు. మండల కేంద్రంలో శివనామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో శివ స్వాములు అశోక్, నాగార్జు న, ప్రహల్లాద రెడ్డి, చంటి స్వామి తదితర స్వాములు ఉన్నారు.

## కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజమార్గం..



**వనపర్తి రూరల్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** న్యాయస్థానాల్లో కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిస్కరించుకుంటేనే రాజమార్గం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ ముజీజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం వనపర్తి న్యాయస్థానాల వద్ద జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని పురస్కరించుకోని ఆయన మాట్లాడుతూ కేసుల వల్ల సమయం, డబ్బు వృద్ధా కాకుండా కేసులను పరిష్కరించుకోవడంలో లోక్ అదాలత్ సంస్థ మధ్యవర్తిత్వం వహిస్తుందని తెలిపారు. వనపర్తి న్యాయస్థానాల్లో క్రిమినల్‌కు సంబందించిన 639, సివిల్ కేసులు2, మోటారు వాహనాలు 6, బ్యాంకు లిటిగేషన్లు 15 మొత్తం కలిపి 662 కేసులు పరిష్కారం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రజిని, జేనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్,బార్ అధ్యక్షులు భరత్ కుమార్, న్యాయవాదులు పుష్పలత, జయలక్ష్మి, వెంకటేశ్వర్ రెడ్డి, మోహన్ కుమార్, అనంత్ రాజ్, విష్ణువర్దన్ రెడ్డి, శివన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయితీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు...

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల పరిధిలో నూతనంగా ఏర్పడిన 3గ్రామపంచాయితీ భవనాలకు నిధులు మంజూరు అయినట్లు శనివారం ఎంపీపీ కృష్ణనాయక్ తెలిపారు.సీఎం కేసీఆర్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృషితో తాండాలకు మహర్దశ ఏర్పడిందన్నారు.తాండాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతోపాటు సీసీ రోడ్ల నిర్మాణం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లాంటి పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని కోతులకుంట తాండా కర్ణె తాండా, ఈర్లతాండ గ్రామపంచాయితీలకు నూతన భవనాలను ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయింపు జరిగిందని గుర్తు చేశారు. వెనుకబడిన మారుమూల ఎత్తైన ప్రాంతాల్లోని తాండాలను సస్యశ్యామలం చేయడానికి మంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. కర్ణె తాండా లిఫ్ట్ పూర్తి కావడంతో ఎత్తైన ప్రాంతాలకు సాగునీరు అందుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు గిరిజ న తాండా వాసులకు లబ్ది చేకూరే విధంగా ఉన్నాయని తెలిపారు. నూతన గ్రామపంచాయి తీల భవనాల నిర్మాణానికి కృషి చేసిన మంత్రికి కోతులకుంట తాండా సర్పంచ్ శ్రీను నాయక్, కర్ణెతాండ సర్పంచ్ శాంతా కృష్ణా నాయక్, ఈర్లతాండ సర్పంచ్ గోపాల్ నాయక్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి



**జడ్చర్ల,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** దయాల్ ఉపాధ్యాయ 55వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వారి సేవలను స్మరించుకుంటూ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ 1952లో భారతీయ జనసంఘంలో చేరి ఉపాధ్యక్షుడిగా నియమితుడయ్యాడు. శ్యాంప్రసాద్ ముఖర్జీ మరణం అనంతరం 1967లో జనసంఘ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించాడు. పార్టీని విజయపథంలో నడిపంచడానికి కీలక పాత్ర పోషించాడు. ప్రాచీన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దగలిగారు. వారికి భారతీయ జనతా పార్టీ కార్యక ర్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, టౌన్ ప్రధాన కా ర్యదర్శి వెంకట్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్, ఓబిసి అధ్యక్షుడు అనంత కిషన్, కిసాన్‌మోర్చా నాయకుడు బుక్కనవీన్, బిజెవైఎం నాయకులు పిట్టల నరేష్, శ్రీనాథ్, రవి, టౌన్ ఉపాధ్యక్షులు తాండ్ర మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, డోజర్ శివ, ధీరజ్, కాశి కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి

**ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం**



**గద్వాల టౌన్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** రాహుల్‌గాంధి భారత్ జుడో యాత్ర ముగి సిన సందర్భంగా జోడోయాత్ర సందేశం ప్రజల్లోకి తీసుకుపోవాలనే ఉద్దేశంతో గద్వాల నియోజకవర్గంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్ర మం శనివారం 11 ఫిబ్రవరి మల్దకల్ మండ లంలో ఉదయం తాటికుంట, నాగర్‌దొడ్డి గ్రామాలలో ప్రతి ఇంటికి చేతితో చేయి కలిపి కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుపుతూ ఈ హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ప్రజలలోకి తీసుకుపోవడం జరుగుతుంది. కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి, మాజీ మున్సిపల్ చైర్మన్ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బల్గెర నారాయణరెడ్డి, షేక్ జమాల్, ఇలియాస్, రాజేంద్ర, వెంకటేష్, రఘునాయుడు, శ్రీకాంత్‌గౌడ్, రవినాయుడు, మజీద్, కోటేష్, హాజి, నాగర్‌దొడ్డి, తాటికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాల్మీకి, పోడు రైతులను మరోసారి మభ్యపెట్టేందుకు కేసీఆర్ తీర్మానం..

వనపర్తి టౌన్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకొని ప్రభుత్వం ఎన్నికలలో లబ్దిపొందేందుకు పోడు భూముల రైతులకు ఆశలు కల్పిస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2008లో అటవీ హక్కుల చట్టం ఆర్ఎఫ్ఆర్ షెడ్యూల్ ట్రైబల్స్ అండ్ అదర్ ట్రైబల్ ఫారెస్టు వెల్లర్స్ రికాగ్నైజింగ్ ఫారెస్ట్ యాక్ట్ తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ చట్టం ప్రకారం 10ఎకరాలలోపు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టహక్కు కల్పించాలని చెబుతుందని అన్నారు. ఈ హక్కు ప్రకారం ఇప్పటికీ 2లక్షలమంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకుంటే 93వేల మంది రైతులకు పట్టాలు ఇవ్వడం జరిగిందని, మిగతా వాటి ఊసే లేదని అన్నారు. కేసీఆర్ స్వయంగా పర్యటించి పోడు భూముల రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి మాట తప్పి వేల ఎకరాలు గుంజుకోని రైతులను రోడ్డుపై వేసారని అన్నారు. వనపర్తిలో పోడు భూములపై హక్కుల కోసం పోరాటం చేస్తున్న రైతులపై కేసులు పెట్టడం జరిగిందని అన్నారు. కొంతమంది గిరిజనుల



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

భూములు ముందే తమ అనుచరులకు కట్టబెట్టే విధంగా ఒప్పందం చేసుకోని పోడు భూములకు పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి ప్రయత్నాలు మానుకోని రాష్ట్రంలో 66లక్షల ఎకరాల పోడు భూములు

### చిత్తశుద్ధి ఉంటే చట్టబద్ధత కలిపించాలి..

ఉన్నాయని వీటిని సాగు చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వాల్మీకి సోదరుల డిమాండ్ ఎస్టీ జాబితాలో చేర్చాలని 2017లో తీర్మానం చేశారని నేటి వరకు కార్యరూపం దాల్చలేదని అన్నారు. మరోసారి ఎన్నికల సందర్బంగా తీర్మానం చేసి వాల్మీకుల మద్దతు పొందాలని కేసీఆర్ ప్రయత్నం చిత్తశుద్ధి ఉంటే ఇతర ఎస్టీ కులాలకు రిజర్వేషన్ లకు భంగం కలగకుండా వాల్మీకి సోదరులకు చట్టబద్దత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి నియోజకవర్గంలో మరోసారి రావుల చంద్రశేఖర్ రెడ్డి పోటీ చేయాలని అన్ని వర్గాల ప్రజలు చేస్తున్న ఒత్తిడి మేరకు రావుల సుముఖంగా నిర్ణయం ప్రకటించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, ఏర్పుల రవి యాదవ్, వహీద్, ఖాదర్, డి.బాలరాజు, ఎం.బాలు నాయుడు, దస్తగిరి, అనిల్, పాల్గొన్నారు.

# మన్యంకొండలో భక్తులను ఆకట్టుకొన్న నాటకం



మన్యంకొండలో పురోహితులతో కళాకారులు

**దేవరకద్ర,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం రాత్రి ప్రదర్శించిన నాటకం భక్తులను ఎంతగానో ఆకట్టుకొంది. స్వామివారి బ్రహ్మోత్స వాల సందర్బంగా శ్రీభద్రాద్రి రామదాసచరితం భక్తిరస నాటకాన్ని మహబూబ్‌నగర్ జనతాసేవాసమితి అధ్వర్యంలో దేవస్థానం కోనేరు వద్ద ప్రదర్శించారు. ఈ నాటకానికి శ్రీ వరకవుల నరహరిరాజు రచన,సంగీతం,దర్శకత్వం వహించారు. ఈ నాటకంలో రామదాసు పాత్రను దుర్వాసరాజు పోషించారు. అలాగే తానీషనవాబు పాత్రను రామకృష్ణ,శ్రీరామ పాత్రను నరసింహ్ములు,లక్ష్మణ పాత్రను తిరుపతయ్య,అక్కన్న పాత్రను అంజిలయ్య,మాదన్న పాత్రను కిష్టప్ప,వార్తావహుడు పాత్రను వెంకటయ్య,భట్టాచార్య పాత్రను అయోధ్య,మోబీన్ పాత్రను సత్యనారాయణ,శ్రీకృష్ణ పాత్రను అంజిలయ్య,అర్జున పాత్రను తిరుపతయ్య,దుర్యోదన పాత్రను సత్యనారాయణ,మయసభ ఏకపాత్రాభినయాన్ని కూడ సత్యనారాయణ పోషించారు. ఈ నాటకంలో కళాకారులు తమతమ పాత్రల్లో లీనమై ప్రదర్శించారు. ఈ నాటకాన్ని జిల్లానలుమూలల నుండి వచ్చిన భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులను దేవస్తానం తరపున ఘనంగా సన్మానించారు.

# నరేంద్రమోదీ సారధ్యంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందాలి..



పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తిటౌన్,ఫిబ్రవరి11 ప్రభాతవార్త:**భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ బలిదాస్ దివాస్ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బి.రామ్మోహన్ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్బంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం మాట్లాడుతూ 1916 సెప్టెంబర్ 25న అతి సామాన్య కుటుంబంలో జన్మించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ బాల్యం నుండే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్లో ప్రచార జీవితం ప్రారంభించి 1951లో జనసంఘ్ ఆవిర్భావంలో డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కోరిక మేరకు ఆర్ఎస్ఎస్ నుండి రాజకీయ క్షేత్రం జనసంఘ్ ప్రచారక్ గా ప్రారంభించి కొంతకాలానికి అచల భారత అధ్యక్షులుగా రైలులో పాట్నాకు ప్రయాణిస్తున్న దీన్ దయాళ్ నాటి ప్రధాని నెహ్రూ, కాంగ్రెస్ పన్నిన పన్నాగంలో అనుమానాస్పదంగా మరణించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భార్, అంత్యోదయ బావాలతో అనేక పథకాల రూపకల్పనతో పేదలకు సంక్షేమ ఫలాలు అందాలని వారు ఆర్థిక స్వావలంబన సాధించాలని కృషి చేస్తుందని అంత్యోదయ విధానాన్ని అమలు చేయడంలో ఉజ్వల యోజన, జన్ దన్ ఖాతాలు, ప్రదానమంత్రి ఆవాస్, గ్రామీణ సడక్, స్వచ్ఛ భారత్ మిషన్, దీన్ దయాల్ గ్రామ జ్యోతి, కౌశల్, సుకన్య సమృద్ధి యోజన, బేటి పడావో, బేటి బచావో లాంటి పథకాలతో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్ నినాదంతో అందరికి లక్ష్యాల ఫలాలు అందించాలన్న ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.సీతారాములు, జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జీ పెద్దిరాజు, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఆగుపోగు కుమార్, సీనియర్ నాయకులు ద్వారపోగు నారాయణ, అసెంబ్లీ కన్వీనర్ దాసరాజు ప్రవీణ్, కంటెస్ట్ కౌన్సిలర్ నందిమల్ల రవి, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్, పట్టణ ప్రదాన కార్యదర్శి మామిళ్లపల్లి రాయన్న, చుక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర సంఘం నాయకుల ముందస్తు అరెస్టు.



పోలీసు స్టేషన్ లో వడ్డెర సంఘం నాయకులు

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** అసెంబ్లీ ముట్టడికి ప్రయాణమైన వడ్డెర సంఘం నాయకులను శనివారం ఎస్సై శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అరెస్టు చేశారు. ఈ సందర్బంగా వనపర్తి జిలాకల వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని 40 సంవత్సరాల నుండి ప్రభుత్వాలు, పాలకులు మోసం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటాలు చేశామని గుర్తు చేశారు. తెలంగాణ సాధించుకుని 8ఏళ్ల గడిచిన నేటికి వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీలు ఇస్తూ ప్రభుత్వాలు కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. వడ్డెర సంఘం నాయకులకు హామీపి ఇస్తూ పట్టించుకోవడం లేదని అన్నారు. వడ్డెరులను ఓట్లకు మాత్రమే వాడుకుంటున్నారని తెలిపారు. వడ్డెర ఫెడరేషన్ కు 2018వ సంవత్సరం నుండి ఒక్క పైసా కూడా కేటాయించకుండా పాలవర్గాన్ని నియామకం జరగకువడా కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వడ్డెరులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసెంబ్లీ ముట్టడికి వడ్డెర సంఘం హక్కుల కోసం హైదరాబాద్ కు వెళ్తుండగా ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. అరెస్టు అయిన వారిలో దాసర్ల భూమయ్య, శాంతయ్య, శ్రీరాములు, మల్లేష్, ఆంజనేయులు, రామస్వామి, బీచుపల్లి, కృష్ణయ్య, యాదయ్య ఉన్నారు.

# దోమల నివారణకు చర్యలు:వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్



దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచన మేరకు వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం మేరకు వనపర్తి మున్సిపల్ పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపట్టడం జరిగింది. ఇటీవల వనపర్తి ప్రాంతంలో విపరీతంగా దోమల బెడద ప్రజలు బాధపడుతున్న సంగతిని నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బయెటిక్స్ స్ప్రే చేయవలసిందిగా ఆదేశించారు. అందులో భాగంగా దోమలు పెట్టిన గుడ్లు లార్వా నివారణకు చర్యలు వనపర్తి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. బయోటిక్స్ ద్వారా డ్రైనేజీలలో నిలువ ఉన్న నీళ్లలో స్ప్రే చేయడం ద్వారా గుడ్ల నివారణతో పాటు దోమల నివారణకు అవకాశం ఉంది. శనివారం 1వ వార్డు బ్రహ్మంగారి వీధి రాయగడ్డలో కౌన్సిలర్ కాగితాల లక్ష్మీనారాయణతో కలిసి వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇండ్ల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టెంకాయ బొండాలు నిల్వ పక్కల బయటవేయకుండా మున్సిపల్ చెత్త ట్రాక్టర్లకు వేయాలని ఆయన సూచించారు. ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని రోగాల బారినపడకుండా ప్రతి ఒక్క పౌరుని బాద్యతగా మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ కాగితాల లక్ష్మీనారాయణ, 21వ వార్డు కౌన్సిలర్ వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది మన్నెం, పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి 15నుండి మార్చి2 వరకు ప్రాక్టీకల్ పరీక్షలు..

**వనపర్తి క్రైమ్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిబ్రవరి 15నుండి మార్చి 02వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌గా నిర్వహించబడుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థులు 3294 మంది 32పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థులు మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు 2018 మంది 8పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడుతుందని తెలిపారు. విద్యార్థులు తమ తమ కళాశాలల నుండి హాల్ టికెట్స్ పొందాలని ఆయన సూచించారు.

## బిజెపి సీనియర్ నాయకులు బండల వెంకట్రాములు జన్మదిన వేడుకలు



**గద్వాలటౌన్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంటలోని వారి స్వగృహంలో సాటికోళ్ల రంజిత్ ఆధ్వర్యంలో బిజెపి సీనియర్ నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, బిజెపి గద్వాల పట్టణ అధ్యక్షులు బండల వెంకట్రాములు జన్మదినం సందర్భంగా శాలువా, గజ మాలతో సన్మానించి, వారితో కేక్ కట్ చేయించి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిజెవైఎం గద్వాల పట్టణ ఉపాధ్యక్షులు పరశురాము, రాజుయాదవ్, మహెందర్, పరశురాము, నాగేందర్‌బాబు, మహెంద్ర, అంజి, ప్రవీణ్, నరేష్, ఆనంద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మనోహరన్న ఆర్థిక సహాయం



**గండీడ్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** మండలంలోని జక్లపల్లి గ్రామానికి చెందిన మేడిదే చిన్న నర్సమ్మ శనివారం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న గౌరవ ఆపద్భాందవుడు, డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అందుబాటులో లేకపోవడం వల్ల వారి అనుచరులతో కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం నిమిత్తం రూ. 5 వేలు అందించడం జరిగింది. శ్రీనివాస్‌రెడ్డి పగిద్యాల వెంకట్‌రెడ్డి, శేఖర్, కుమ్మరి బాలరాజు, చాకలి రవి, వడ్డె రంగయ్య, బిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభిమన్యురెడ్డిని పరామర్శించిన జీఎంఆర్..



**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి11 ప్రభాతవార్త:**వనపర్తిజిల్లా పరిధిలోని మదనాపురం మండలం కొన్నూరు గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిమన్యు రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందిం ది. ఈ విషాద సంఘటనను తెలుసుకున్న మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ జిల్లాఅధ్యక్షులు జి.మధుసూధన్‌రెడ్డి కొన్నూరు గ్రామంలో అభిమన్యురెడ్డిని పరామర్శించి సంతాపం ప్రకటించారు.జీఎంఆర్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రోగాలు దరిచేరకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలి:గ్రామ సర్పంచ్ బి. కృష్ణ



పౌష్టికాహార కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

**కోయిల్‌కొండ,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** రోగాలు దరిచేరకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని గ్రామ సర్పంచ్ బి. కృష్ణ సూచించారు. శనివారం మండల కేంద్రమైన కోయిల్ కొండలో పౌష్టికాహార కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఫర్టిలైజర్ లేని మందులతో తయారవుతున్న పౌష్టికాహారం తీసుకోవడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పౌష్టి కాహార కేంద్రం కోయిల్‌కొండ వెల్నెస్ కోచ్ షేక్ కలీం మాట్లాడుతూ మారుతున్న సమాజంలో మనుషులు రక రకాల ఒత్తిళ్లకు గురవుతూ ఉండ డంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. శరీరానికి తగ్గట్లు బరువు, బరువుకు తగ్గట్లు శరీరం ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం గడపడం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రమైన కోయిల్‌కొండలో పౌష్టికాహార కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కేంద్రాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## మారుమోగిన శివనామస్మరణ..



శివ స్వాముల పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి

**పాన్‌గల్,ఫిబ్రవరి11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేతెపల్లి గ్రామంలో శివ భక్తులు నిర్వహించిన అగ్ని గుండ మహోత్సవ కార్యక్రమంలో శివనామ స్మరణతో మారుమ్రోగింది. శనివారం గ్రామంలో శివ గురుస్వా ముల ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర ఆలయం వద్ద అగ్నిగుండ మ హోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్స వంలో శివ స్వాములు అధిక సంఖ్యలో హా జరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్నిగుండంలో నుండి స్వాములు దాటుతుండగా భక్తులు ఓం నమ:శివాయ హర హర మహాదేవ శివ శివా..అంటూ భక్తులు శివనామ తన్మయత్వంలో మునిగితేలారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షుడు మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఎంపీపీని శివస్వాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు రామకృష్ణ, లక్ష్మణ్, రామకృష్ణ, మల్లేష్, పర్వతాలు తదితర శివ స్వాములు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

◆ విద్యుత్ సమస్యలపై యూనియన్ నిలదీసిన ప్రజా ప్రతినిధులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**తెల్కపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల సమావేశపు హాలులో శనివారం ఎంపిపి కొమ్ము మధు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా కొనసాగింది. మొత్తం 17 అంశాలపై వ్యవసాయ, రెవెన్యూ, ఎక్సైజ్, గ్రామీణ మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, నీటి పారుదల, వైద్యారోగ్య, మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కొమ్ము మధు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయంతో వ్యవహరించి మండల అభివృద్ధికి అందరు సహకారం అందించాలని సూచించారు. అదేవిధంగా 24 గంటల విద్యుత్ సరఫరా సమస్యలపై ఆరా తీశారు. గ్రామాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని రైతులకు విద్యుత్ సరఫరా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి అధికారులపై మండిపడ్డారు. అదే క్రమంలో మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు సమయానికి లేకపోవడం వలన ప్రసవానికి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. గ్రామాలలో వేసిన సిసి రోడ్డు పనులకు బిల్లులు రాకపోవడం వలన సిసి రోడ్లు వేయాలంటే వెనుకంజ వేయాల్సి వస్తుందని ఎంపిటిసి విజయలక్ష్మి అన్నారు. సంబంధిత ఏఈ స్పందించకపోవడం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, వెంటనే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానికి తహసిల్దార్ రాకపోవడంతో ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మాధవరం హనుమంతరావు, జడ్పీటిసి సుమిత్ర, డిఎల్‌పిఓ రామ్మోహన్‌రావు, ఎంపిడిఓ చెన్నమ్మ, సూపరింటెండెంట్ భాస్కర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర 108అంబులెన్స్ సర్వీస్‌లలో ఉద్యోగ అవకాశాలు



ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవి కుమాం

**పెద్దమందడి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** అత్యవసర 108 అంబులెన్స్ సర్వీస్ ను నిర్వహిస్తున్న గ్రీన్ హెల్ద్ సర్వీసెస్‌లో ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ ప్రోగ్రామ్ మేనేజర్ రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టిక్నీషియన్), ఫైలట్(డ్రైవర్) పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈఎంటీ పోస్టుకు సైన్స్ గ్రూపుల్లో డిగ్రీ డిప్లమా బీఎస్సీ (బిజెడ్సీ), బీఎస్సీ (నర్సింగ్)జీఎన్ఎమ్, బీఫార్మా, డీఫార్మా ఉన్నవారు అర్హులని తెలిపారు. వయసు 30సంవత్సరాల లోపు ఉండాలని వారు తెలిపారు. పనిచేయు ప్రదేశం తెలంగాణలో ఎక్కడైనా చేయల్సి ఉంటుందని అన్నారు. ఈఆర్ఓ పోస్టుకు ఇంటర్, డిగ్రీ కలిగి ఉండి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. హైదరాబాద్‌లో పని చేచాలని అన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 14వతేదీననాగర్‌కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించేఎంపికకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని వారు తెలిపారు.

## పందులతో పరేషాన్



ఉదయ మెమోరియల్ స్కూల్ ప్రాంగణంలో పందుల గుంపు

**జడ్చర్ల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** జడ్చర్ల పురపాలికలో రోజు రోజుకు పదుల సంఖ్య పెరుగుతూ ప్రజల ప్రాణాలకు హాని తలపెడుతున్న పాలకవర్గానికి కాని, అధికారులకు కాని నిమ్మకు నీరెత్తినట్లు కూడా లేదంటూ పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులపై వాహనదారులు ఎంతో మంది ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాలల ప్రాంగణంలో కూడా పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పట్టణ అభివృద్ధిని ఆకాంక్షించే నాయకులకు పందులు కనిపించడం లేదా అని పలువురు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**వనపర్తి రాజీవ్ చౌక్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో రాజీవ్‌చౌక్ లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు జిల్లా వాల్మీకి సంఘం నాయకులు పాలాభిషేకాలు చేశారు. శుక్రవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించడం జరిగింది. వాల్మీకులు అన్ని రంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మంత్రి నిరంజన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, చైర్మెన్ మార్కెట్ యార్డ్ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు ఉంగ్లం తిరుమల్, లక్ష్మీనారాయణ, వాల్మీకి సంఘం జిల్లానాయకులు రామ్మూర్తి నాయుడు, వేణుగోపాల్, రవికుమార్, శివ కుమార్, ఆశన్న, దేవన్న నాయుడు, రాఘవేందర్, వాల్మీకి సంఘం సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

## వీపనగండ్ల మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎల్లేని



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎల్లేని సుధాకర్ రావు

**వీపనగండ్ల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల అభివృద్ధికై పోరాటంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని, కొల్లాపూర్ కోటపై బీజేపీ జెండా ఎగారాలనే లక్ష్యంతో కార్యకర్తలు కృషి చేయాలని కొల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు ఎత్తిచూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాకేష్ యాదవ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సాయం అందజేసిన మిత్రబృందం



స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థి కాట్రోజ్ నారాయణచారి 2013 సంవత్సరంలో మృతి చెందాడు. మృతుడి కూతురు తేజస్విని వివాహం ఆదివారం జరుగుతుండడంతో పూర్వ విద్యార్థుల మిత్రబృందం కలిసి రూ.31,516 స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు మృతుడు నారాయణ చారితో ఉన్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురువులు రాంరెడ్డి, కొండారెడ్డిచ శేఖర్, మిత్రబృందం నరేందర్ బాబు, పాలవాది శ్రీనివాసులు, సతీషీలారెడ్డి, ఆంజనేయులు, మద్ది నరసింహా రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జిందా షా వలీ ఊర్సు ఉత్సవాలు

**వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో వెలిసిన సయ్యద్ ఖాజా జిందా షా వలీ ఊర్సు ఉత్సవాలు ఆదివారం గుసుల్ షరీఫ్‌తో ఊర్సు ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఉత్సవ నిర్వాహకులు మొహమ్మద్ షంషుద్దిన్, మొహమ్మద్ ఇలియాజ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి గంధోత్సవం, 14వ దీపారాధన, 15న ఖురాన్‌పఠనంతో ఊత్సవాలుముగుస్తాయన్నారు. ప్రతియేడాది సయ్యద్ ఖాజా జిందా షా వలీ ఊర్సు ఊత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలోమొహమ్మద్ ఫరీద్, సాజీద్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

# సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ




మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని శనివారం ఉదయం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. శనివారం జిల్లాలో లోక్ అదాలత్ నిర్వహించుకోవడం జరుగుతుందని, సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కక్షిదారులను సూచించారు. ఒకప్పుడు గ్రామాలలో పంచాయతీ కట్ట అనేటివి ఉండేవని, ఇరు పక్షాలను కూర్చోబెట్టి గ్రామ పంచాయతీలోనే పెద్దలు సమస్యను పరిష్క రించేవాళ్లని గుర్తు చేశారు. అదేవిధంగా ఇప్పుడు కోర్టులో సైతం లోక్ అదాలత్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. రాజి ధోరణితో ఇద్దరు కక్షిదారులు కలిసి ముందుకు వచ్చి తమ తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లా ఏర్పాటు అయినాలుగు సంవత్సరాలు అవుతున్నాయని, అలాగే జిల్లా కోర్టు ఏర్పాటు అయి ఎనిమిది నెలలు పూర్తయిందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని ఈ రోజు జాతీయ లోక్ అదాలత్ దినోత్సవం సందర్భంగా జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కొన్ని సంవత్సరాలు పాటు పెండింగ్ ఉన్న కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టులో కేసులు పెరగకుండా త్వరగా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. లోక్ అదాలత్‌లో ఇద్దరి మధ్య వాగ్వాదాలు, చిన్న కేసులను, ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో తేడాలు ఉన్నవాటిని పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులకు రాజీ పత్రాన్ని అందించడం జరిగింది. మొత్తం కేసుల పరిష్కారం1414, నగదు 7,98,0100. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జి. శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జూనియర్ సివి జడ్జి శ్రీదేవి, పిపి సురేష్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌గౌడ్, న్యాయవాదులు సీతారాం, రఘువీర్‌యాదవ్, నారాయణ, లక్ష్మిపతి, రాజవర్ధన్‌రెడ్డి, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న న్యాయవాదులు

## తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో సైకడేరియం ఏర్పాటు



సైకడేరియం మొక్కను నాటుతున్న దృశ్యం

**జడ్చర్ల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** స్థానిక డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో శనివారం సైకడేరియంను సమన్వయకర్త డా.బి. సదాశివయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్య ప్రణాళికలో భాగంగా సైకడేసి అనే వివృతబీజపు కుటుంబం ఉందని ఈ మొక్కలను ప్రత్యక్షంగా చూస్తే విద్యార్థులలో పరిజ్ఞానం పెంపొందుతుందని అందుకే ఏర్పాటు చేసినట్లు సదాశివయ్య తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా. అప్పియ చిన్నమ్మ మాట్లాడుతూ సైకడేసి కుటుంబానికి చెందిన 7 జాతుల మొక్కలను సుమారు 30 నాటామని తెలిపారు. ఈ మొక్కలను యోగివేమన విశ్వవిద్యాలయంలోని లీడ్ బొటానికల్ గార్డెన్ నుండి సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్లు పరిశోధక విద్యార్థి రమాదేవి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల విస్తరణలో జరిగే ప్రమాదాలకు మున్సిపల్ ఛైర్మన్ బాధ్యత వహించాలి



డీసీఎం వాహనంపై పడిన కరెంటు స్థంబాలు

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో లోపాబోయిష్టంగా రోడ్ల విస్తరణ జరుగుతుంది. ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టడం లేదు, జాగ్రత్తలు తీసుకోవడం లేదు, రోడ్లమీద రోడ్ల పక్కన ఉన్న కరెంటు స్థంభాలు టెలిఫోన్ స్థంభాలను మురుగు కాల్వలను ప్రత్యామ్నాయపరచకుండా ఇష్టారీతిగా రోడ్ల నిర్మాణం జరుగుతుందని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులు లోపాబోయిష్టంగడా జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు పనులు జరుగుతున్న మార్గంలో వెళ్లే వాహనాలు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. రామ టాకీస్ దగ్గర శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం ప్రజలను భయభ్రాంతులకుగురి చేస్తుందని అన్నారు. కరెంటు స్థంభాలు వాహనంపై పడి భారీ నష్టాన్ని కలిగించాయని అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలసిన బాధ్యత వనపర్తి మున్సిపల్ చైర్మెన్, కమీషనర్, ఆర్ అండ్ బి శాఖ వారికి ఉంటుందని తెలిపారు. ప్రమాదాలు జరిగి నష్టం కలిగితే కనీసం వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి ప్రభుత్వంతో డబ్బులు లేవు అంటారు ఇలాంటి దారుణంలో ప్రభుత్వ పరిపాలన కొనసాగుతుందని అన్నారు. సూపర్ పాలన అభివృద్ధి అనేది మాటల్లో చెప్పడం కాదు చేసే పని విధానంలో తెలుస్తుందని ఆయన విమర్శించారు. సరైన పద్ధతిలో రోడ్ల విస్తరణ చేపట్టి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి చెందడం ఎంతో బాధకరం



మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన బైకాని యాదయ్య, కేశవులు, శ్రీనివాసులు, లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామస్వామిలు గురువారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి, జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంలు వేర్వురుగా పరామర్శించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరుపున ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయాలను అందించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేస్తానని ఆచారి భరోసానిచ్చారు. మృతుల పిల్లల విద్యాభివృద్ధికి కసిరెడ్డి విద్యా సంస్థల ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌కుమార్, జంగయ్యయాదవ్, రామకృష్ణ, చెర్క రాజశేఖర్, కాదూరాం, అలీ, గోళి సురేందర్‌రెడ్డి, వెంకటమ్మ, చంద్రమ్మ, రవీందర్‌రావు, రమేష్‌గౌడ్, రామ స్వామి, వెంకట్‌రెడ్డి శేఖర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, శ్రీని వాసులు, దువ్వాసి రామస్వామి తదితరులు ఉన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీకసిరెడ్డి నారాయణరెడ్డి, ఆచారి

## దోమల నివారణకు హైడ్రోజన్ లిక్విడ్ పిచికారి



హైడ్రోజన్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**కొత్తకోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** పట్టణంలోని 9వ వార్డులో దోమల నివారణ కోసం హైడ్రోజన్ లిక్విడ్ మందును శనివారం పిచికారి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్ ఆదేశం మేరకు ఈ మందులను పిచికారి చేశారు. మిగితా వార్డులో కూడా ఈ ద్రవాన్ని పిచికారి చేయనున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది రవీందర్, వెంకటయ్య, కొండన్న తదితరులు ఉన్నారు.

## ధ్వజ స్థంభ ప్రతిష్టకై పూజలు



ధ్వజస్థంభం ప్రతిష్ట నిర్మాణానికి పూజలు చేస్తున్న సర్పంచ్

**కొత్తకోట, ఫిబ్రవరి11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనిమెట్ట గ్రామంలో రామాలయం వద్ద నూతనంగా ధ్వజస్థంభం ప్రతిష్టకై శనివారం వేద పండితులు పూజలు నిర్వహించారు. గణపతి హోమం, పంచామృ తాభిషేకం, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సర్పంచ్ గాధం రాణి, మాజీ వైస్ ఎంపీపీ గుంతమల్లేష్, బీఆర్ఎస్ నాయకులు కోటేశ్వర్ రెడ్డి, పరమేష్, ఆలయ పూజారి నరేందర్ శర్మ, కమిటీ సభ్యులు బ్రహ్మాయ్యచారి, బాలయ్య, రాజేశ్వర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఘన సత్కారం



ఎమ్మెల్యే ఆలను సత్కరిస్తున్న వాల్మీకి నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పట్ల శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నివాసంలో నియోజకవర్గంలోని వాల్మీకి బోయలు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించారు. వాల్మీకి బోయల చిరకాల కోరిక నెరవేరబోతుందని ఎస్టీ బిల్లుకు మద్దతుగా నిలిచి తీర్మానం చేయడం పట్ల ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సత్కరించిన వారిలోఎంపీపీ కొండలు, సర్పంచు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రాజు, పంతులు, సత్యన్న, గోవిందనాయుడు, వెంకటరమణ, పునకల్ కృష్ణ, జోగిని చంద్రశేఖర్, శ్రీనివాస్, భాస్కర్ నాయుడు, నాగరాజు, దాసరిపల్లి రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాల్వలపై పిచికారి



దోమల నివారణకై పిచికారి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**పెబ్బేరు, ఫిబ్రవరి11 ప్రభాతవార్త:** దోమల నివారణ కోసం మురుగు కాల్వలపై పిచికారి చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీసాయి తెలిపారు. శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశానుసారం పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని 4,5,6వ వార్డులల్లో దోమల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో వాటి అభివృద్ధి జరగకుండా యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారి చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ గోపిబాబు, 6వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణ, మేనేజర్‌గణేష్ బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమ మహేశ్వర్ రెడ్డి, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేసిన పెబ్బేరు వాల్మీకులు



**పెబ్బేరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుటకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపగా అది కేంద్రానికి అందలేదు అనడంతో మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి బోయల న్యాయమైన కోరికను నెరవేర్చే దిశగా మరో మారు శుక్రవారం సీఎం కేసీఆర్ వాల్మీకి బోయలతో పాటు, దాని ఉపకులాలనుఎస్టీ జాబితాలో చేర్చుటకు తీర్మానాన్ని ప్రవే శపెట్టగా, శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడాన్ని స్వాగతిస్తున్నట్లు వాల్మీకి ననాయకులు తెలిపారు. దీనికి ఉద్యమ పంథా ఎత్తుకున్న వాల్మీకి బోయలు సంతోషం వ్యక్తం చేస్తూ శనివారం పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి, పెబ్బేరు మండల వాల్మీకి ఐక్యకార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు హరిశంకర్ నాయుడు, మునీశ్వర్ నాయుడు, బలరాం, వీరస్వామి, వెంకటయ్య, కుమారస్వామి నాయుడు, గోవర్ధన్, కృష్ణ, ఎమ్.కె.మూర్తి, తిరుపతి, శివ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన ఐక్యత చైర్మన్

**వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** బాధితులకు కొండంత అండగా ఉండి ధైర్యాన్నిస్తున్నారు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి. వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన జంగయ్య గత కొన్ని రోజుల క్రితం వాగులో నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తు కాలుజారి క్రిందపడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు గాయపడిన జంగయ్యను యెన్నమ్స్ ఆసుపత్రిలో చికిత్సను అందించారు. ఆసుపత్రి వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న జంగయ్యకు ఆసుపత్రిలో అవసరమయ్యే రూ.70వేల ఖర్చును చెల్లించి బాధితుడికి అండగా నిలిచారు.



ప్రమాదంలో గాయపడిన జంగయ్య

# గడప గడపకు కాంగ్రెస్ యాత్ర



గడప గడపకు హత్ సే హత్ జోడో యాత్ర

**కల్వకుర్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు హత్ సే హత్ జోడో అభియాన్ పాదయాత్ర సందర్భంగా యంగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడు లేనటువంటి ఎప్పుడు చూడని కనీ, విని ఎరుగని విధంగా రాహుల్‌గాంధీ చేపట్టినటువంటి భారత్ జోడో పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయేటటువంటి యాత్ర అని పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి గడప గడపకు హత్ సే హత్ జోడో పాదయాత్ర ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంశీ, వెంకటయ్య, మోహన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, హరీష్, భాస్కర్, శ్రీకాంత్, శివ, రాకేష్, ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా నిజాముద్దిన్ నియామకం



జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా నియామక పత్రం అందుకుంటున్న నిజాముద్దిన్

**కల్వకుర్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నిజాముద్దిన్ గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా నిజాముద్దిన్ నియమిస్తూ శనివారం ఉత్తర్వులను జారీ చేసి పీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సిరాజుద్దిన్, జిల్లా అధ్యక్షులు హబీబ్ ఉర్ రహమాన్‌లు నియామక పత్రాన్ని అందించి అభినందించారు. అనంతరం నిజాముద్దిన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు డీసీసీ అధ్యక్షులు వంశీకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు సొహెల్, పీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సిరాజుద్దిన్, జిల్లా అధ్యక్షులు హబీబ్ ఉర్ రహమాన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మృతురాలు కుటుంబానికి ఆర్థిక సాయం



**లింగాల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామానికి సుల్తాన్ బీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శని వారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ హనుమంత్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబానికి రూ. 5 వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతాలు, సింగిల్ విండో డైరెక్టర్ బాలరాజుగౌడ్, మాధవులుగౌడ్, బిఆర్ఎస్ నాయకులు సైదులుపాష, టి. రాజు, సుల్తాన్‌పాషా, నసీర్‌పాషా పాల్గొన్నారు.

# వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు: ఎస్సై

**గద్వాల టౌన్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** గద్వాల రూరల్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శనివారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు గద్వాల గ్రామీణ ఎస్సై బి.ఆనంద్ తెలిపారు. ఎస్సై బి.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం ఉండవెల్లి మండలం, బొంకూరు గ్రామానికి చెందిన ఖాసిం (34) ఈనెల 7వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ లభించక (ఆవ్యక్తికి మతి స్థిమితం, మూగ వ్యక్తి) పోవడంతో శనివారం గద్వాల గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు కనిపించలేదని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా కనబడితే తమకు 8712670296కు సమాచారం అందించాలని ఎస్సై ఆనంద్ తెలిపారు.



తప్పిపోయిన వ్యక్తి ఖాసిం (ఫైల్)

# చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్



**దేవరకద్ర, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన రాజు భార్యకు రోడ్డు ప్రమాదంలో కాలు ఫ్యాక్చర్ కావడంతో నవోదయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ ఆసుపత్రిలో వారిని కలిసి వారి ఆరోగ్య పరిస్థితి డాక్టర్‌లను అడిగి తెలుసుకుని వారిని పరామర్శించారు.

# ఆర్టీసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**దేవరకద్ర, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని బస్టాండ్‌లో వర్షాకాలం వచ్చిందంటే నీళ్లు చేరి ప్రయాణీకులకు ఇబ్బందిగా ఉంది. వెంటనే బస్టాండ్‌లో నీళ్లు చేరకుండా రూ. 50 లక్షల విలువతో కూడిన కాంక్రీట్ నిర్మాణం కొరకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన ఆర్టీసి చైర్మన్ తక్షణమే మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్‌కు ఫోన్ చేసి వెంటనే త్వరగా మంజూరు చేసేందుకు డీపీర్ మ్యాప్స్ పంపాలని లిఖిత పూర్వకంగా ఆదేశించారు.

# పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

- పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- సిబ్బంది తరచు గ్రామాలను సందర్శించి అనుమానితులపై నిఘా ఉంచాలి
- సైబర్, క్రైమ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ సృజన

**గద్వాల టౌన్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ధరూర్ పోలీస్ స్టేషన్, కెటిదొడ్డి, పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ సృజన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ కె. సృజన ధరూర్ పోలీస్ స్టేషన్, కెటిదొడ్డి ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. శనివారం ధరూర్ పోలీస్ స్టేషన్, కెటిదొడ్డి పోలీస్ స్టేషన్‌లను సందర్శించి స్టేషన్ రికార్డులను, స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేశారు. అందులో భాగంగా ముందుగా గౌరవ వందనం స్వీకరించి సిబ్బంది ప్రాపర్ యూనిఫామ్ మెయింటెనెన్స్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్‌టీమ్, ఎస్‌హెచ్‌ఓ, మెన్‌రెస్ట్ రూం, లాక్ అప్ రూమ్‌ను పరిశీలించారు. అలాగే కోర్టు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ



ఎస్పీకి బొకే అందజేసి స్వాగతం పలుకుతున్న దృశ్యం

విధులు నిర్వహించే అధికారుల రూమ్‌లో రికార్డులు భద్రపరచుట, 5 ఎస్ అమలు తీరును పరిశీలించారు. స్టేషన్‌లో రోజువారిగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విజిటింగ్‌బుక్స్, ఫైనల్ రిపోర్ట్సు తదితర రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టాఫ్‌కు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. మహిళ అధికారులకు రెస్ట్‌రూం సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజుఎన్న బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకుని ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగ తనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాగా రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరు కుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్‌కార్ నిరంతరం24/7 గస్తీ నిర్వహించాలని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, తరచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు శేఖర్‌రెడ్డి, వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వలస కూలీల కుటుంబానికి చెందిన మండ్ల రవికి

# ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్

**పాన్‌గల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండలంలోని రేమొద్దుల గ్రామానికి చెందిన మండ్ల చిన్న బాలయ్య, రామచంద్రమ్మ దంపతులు వలస కూలీలుగా మారుమూల గ్రామమైన రేమొద్దుల నుండి శ్రీరామ్ సాగర్ కాలువ కట్టడానికి వెళ్లి అటు నుండి హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికులుగా కొన్ని దశాబ్దాల పాటు పనిచేసి జీవనం కొనసాగించారు. వారి కుమారుడైన మండ్ల రవి ప్రైమరీ స్కూల్ నుండి టెన్త్ క్లాస్ వరకు రేమొద్దుల ప్రభుత్వ స్కూల్లో చదివి ఇంటర్, డిగ్రీ వనపర్తిలో ప్రభుత్వ కాలేజీ లో ఉపాధ్యయ విద్యను పూర్తిచేసి ఉన్నత విద్య కోసం ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి ఎం.ఏ ఎకనామిక్స్ పూర్తి చేసిన తరువాత పీహెచ్‌డీ అడ్మిషన్ సాధించి తాను చదివిన చదువుకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎన్నో ప్రయాసాలకు, ఒడిదుడుకులకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని తమ పరిశోధన చేయడానికి వెనకాడకుండా వలసలతో చితికిపోయి, పూర్తిగా అభివృద్ధికి నోచుకోకుండా వెనకబడిన మహబూబ్‌నగర్ జిల్లా వలసలకు దేశంలోనే పాలమూరు వలసల జిల్లా ముద్రపడిపోయింది. ఆ తరుణంలో ఈ జిల్లా నుండి ఎందుకు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి వలసలు పోతున్నారు. దానికి గల కారణాలను విశ్లేషించి దాన్ని ఒక సమగ్రమైన నివేదికతో పరిశోధన చేయాలని వలస జిల్లా అయిన పాలమూరు కూలీలపై పరిశోధన చేయాలనే బలమైన కోరికతో తల్లి దండ్రులు చేసే వలస కూలీ పనిని వారి కష్టనష్టాలను ప్రపంచానికి తెలియజేయాలని పరిశోధనలో భాగంగా ఈ అంశాన్ని తీసుకోని మహబూబ్‌నగర్ జిల్లా వలస కూలీలపై పరిశోధన చేయడానికి నిర్ణయించుకొని తన పరిశోధనలను కొనసాగించడానికి ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలోని అర్థశాస్త్ర విభాగంలో పని చేసిన ప్రొఫెసర్ టీఎల్.ఎన్ స్వామి, మాజీ నిజాం కాలేజీ ప్రిన్సిపల్‌గా, తెలంగాణ యూనివర్సిటీ తొలి రిజిస్టర్ గా పనిచేసిన విశ్రాంత ప్రొఫెసర్ టీ.ఎల్.ఎన్.స్వామి పర్యవేక్షణలో ఉమ్మడి జిల్లా వలస కూలీల ఆర్థిక, సామాజిక స్థితిగతుల అంశాలపై పరిశోధనపత్రాన్ని సమర్పించడం జరిగింది. యూనివర్సిటీ అధికారుల పరిశీలన అనంతరం మండ్ల రవి కి డాక్టరేట్ ప్రకటిస్తూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో వాల్మీకి బోయ కులానికి చెందిన మండ్ల రవికి 100 సంవత్సరాలు చరిత్రలో తొలి వాల్మీకి బోయ కులానికి చెందిన వ్యక్తికి ఉస్మానియా యూనివర్సిటీ నుండి అర్థశాస్త్రంలో డాక్టరేట్ పొందడం వాల్మీకి బోయ కులానికి చాలా గర్వకారణం అని తెలిపారు.



డాక్టరేట్ పట్టా తీసుకుంటున్న మండ్ల రవి

రేమొద్దుల గ్రామానికి చెందిన మండ్ల రవి ఒకవైపు చదువుతూ మరోవైపు చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు అనే నినాదాన్ని ఉద్యమాలను నిర్వహించడం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షునిగా సుదీర్ఘకాలం తన సేవలను అందించాడు. అనేక సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై వివిధ వార్తా పత్రికలలో అనేక వ్యాసాలు రాస్తూ, దళిత, గిరిజన, మైనార్టీ సామాజిక ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొని ఎన్నో ఉద్యమాలను నిర్వహించి విజయవంతం చేయడం జరిగింది. ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూని వర్సిటీలో పనిచేయడం జరిగింది. తెలంగాణ పట్టభద్రుల నిరుద్యోగ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మండ్ల రవి మాట్లాడుతూ డాక్టరేట్ రావడంతో ప్రొఫెసర్లు, మిత్రులు, సహచర ఉద్యమకారులు కుటుంబ సభ్యులు తమ అభినందనలు తెలిపారు. రేమొద్దుల గ్రామం ప్రజలు, మిత్రులు, పెద్దలు అందరు తమ గ్రామానికి ఎంతో గర్వకారణం అని సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. నా పరిశోధనకు సహకరించిన వారందరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రులకు, నా కుటుంబ సభ్యులకు ఈ పరిశోధన అంకితం చేస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**వనపర్తి రాజీవ్ చౌక్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో రాజీవ్‌చౌక్ లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు జిల్లా వాల్మీకి సంఘం నాయకులు పాలాభిషేకాలు చేశారు. శుక్రవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించడం జరిగింది. వాల్మీకులు అన్ని రంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మంత్రి నిరంజన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, చైర్మెన్ మార్కెట్ యార్డ్ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు ఉంగ్లం తిరుమల్, లక్ష్మీనారాయణ, వాల్మీకి సంఘం జిల్లానాయకులు రామ్మూర్తి నాయుడు, వేణుగోపాల్, రవికుమార్, శివ కుమార్, ఆశన్న, దేవన్న నాయుడు, రాఘవేందర్, వాల్మీకి సంఘం సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

# వీపనగండ్ల మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎల్లేని



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎల్లేని సుధాకర్ రావు

**వీపనగండ్ల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల అభివృద్ధికై పోరాటంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని, కొల్లాపూర్ కోటపై బీజేపీ జెండా ఎగారాలనే లక్ష్యంతో కార్యకర్తలు కృషి చేయాలని కొల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు ఎత్తిచూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాకేష్ యాదవ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సాయం అందజేసిన మిత్రబృందం



స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థి కాట్రోజ్ నారాయణచారి 2013 సంవత్సరంలో మృతి చెందాడు. మృతుడి కూతురు తేజస్విని వివాహం ఆదివారం జరుగుతుండడంతో పూర్వ విద్యార్థుల మిత్రబృందం కలిసి రూ.31,516 స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు మృతుడు నారాయణ చారితో ఉన్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురువులు రాంరెడ్డి, కొండారెడ్డిచ శేఖర్, మిత్రబృందం నరేందర్ బాబు, పాలవాది శ్రీనివాసులు, సతీషీలారెడ్డి, ఆంజనేయులు, మద్ది నరసింహారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జిందా షా వలీ ఊర్సు ఉత్సవాలు

**వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో వెలిసిన సయ్యద్ ఖాజా జిందా షా వలీ ఊర్సు ఉత్సవాలు ఆదివారం గుసుల్ షరీఫ్‌తో ఊర్సు ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఉత్సవ నిర్వాహకులు మొహమ్మద్ షంషుద్దిన్, మొహమ్మద్ ఇలియాజ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి గంధోత్సవం, 14వ దీపారాధన, 15న ఖురాన్‌పఠనంతో ఊత్సవాలుముగుస్తాయన్నారు. ప్రతియేడాది సయ్యద్ ఖాజా జిందా షా వలీ ఊర్సు ఊత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలోమొహమ్మద్ ఫరీద్, సాజీద్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

# నాలుగు రోజుల్లో సాగునీటి విడుదల చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా..!



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేయాలని ధర్నా నిర్వహిస్తున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం తూతూ మంత్రంగా చేపట్టి 2018 ఎన్నికల్లో ప్రజల ఓట్లు దండుకుని గెలిచిన నేటి వరకు ఎత్తిపోతల పథకం కింద మూడు రిజర్వాయర్లు చేపట్టాల్సి ఉండగా ఏ ఒక్క రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం లేదని అధికారుల నిర్లక్ష్యం సమన్వయం లేకపోవడం వల్ల అటు కర్ణాటక, ఇటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడకపోవడం వల్ల 15 రోజులుగా రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని 4 రోజుల్లోగా రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చూడాలని ఆయన డిమాండ్ చేశారు. 2018 ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎత్తిపోతల పథకం పేరు చెప్పి బిఆర్ఎస్ పార్టీ ఓట్లు వేయించుకుని గెలుపొంది ఇప్పుడు రైతులనునట్టేట ముంచుతుందనిఆరోపించారు. రాయలసీమ ప్రాంతానికి చెందినవారు నీటిని తీసుకుపోతున్నారని కుంటి సాకులు చెబుతూ నీటి గేజు లేదని చెబుతున్నారని అలంపూర్ ఎమ్మెల్యే నిర్లక్ష్యం వల్ల నీటి విడుదల కాక రైతులు సాగు చేసుకున్న పంటలు ఎండిపోయే దశకుచేరుకుంటున్నాయని ఎత్తిపోతల పథకం అస్తవ్యస్తంగా తయారైందని రాజకీయ వ్యవహారాలు అధికార పార్టీలో గ్రూప్ తగాదాలు కలెక్షన్లు పర్సంటేజీలు, ఎలక్షన్‌లపై దృష్టిపెడుతూ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలోచివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు వారికి సమయం లేదని విమర్శించారు. నాలుగు రోజుల్లోగా తుమ్మిళ్ల ఎత్తిపోతలపథకం ఆయకట్టు కిందఉన్న రైతుల పంటలకుసాగునీరు అందించకపోతే ఎత్తిపోతల పథకం వద్ద రైతులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు కూడాతాను సిద్దమని హెచ్చరించారు. ఈ సందర్భంగా సాగు నీటి శాఖఅధికారుల నుండి 2 రోజుల్లోగా రైతుల పంటలకు సాగు నీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అదే విధంగా తుమ్మిళ్ల ఎత్తిపోతలపథకం వద్దఏఐసిసి కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ రైతులతో కలిసి సాగునీటి విడుదల చేయాలని ధర్నాకుదిగడంతో అలంపూర్‌ఎమ్మెల్యే అబ్రహం వెంటనే ఆంధ్రప్రదేశ్‌కర్నూలు జిల్లాసాగునీటి శాఖఇంజనీర్‌తో ఫోన్‌లో మాట్లాడి పంటలు ఎండిపోతున్నాయని రైతులకు సాగునీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరగా రెండు రోజుల్లోగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

# డోలారోహణ కార్యక్రమంలో పాల్గొన్న కాటం ప్రదీప్‌కుమార్

**దేవరకద్ర, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన రాజేష్‌గుప్తా కుమారుడి డోలారోహణ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ పాల్గొని బాబును ఆశీర్వదించారు.

